క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 67. వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 70, కాకర 35, బీర 35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 14, కారెట్ 55. దొండ 13, ఆలు 20, ఉల్లి 19, గోకర 18, దోస 16, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 55, అర్వి 35, మునగ 48, చిలగడదుంప 40, బీట్‌రూట్ 25, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ 85.
ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

24న మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సైక్లింగ్ పోటీలు

లింగోజిగూడ: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 24న నెక్లెస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 10 ఏళ్లు నిండిన బాల బాలికలు, యువతీ, యువకులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు అందజేస్తామని, విజేతలకు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు విజయ్ భాస్కర్ రెడ్డిని ఫోన్ 9010610888, దత్తాత్రేయ 9440484825లో సంప్రదించాలన్నారు.

బీజేపీ యువమోర్చా ఎల్‌బీనగర్‌కో కన్వీనర్‌గా సాయిరామ్


సాయిరామ్‌గౌడ్

మన్సూరాబాద్: బీజేపీ యువమోర్చా ఎల్‌బీనగర్ నియోజకవర్గం కో కన్వీనర్‌గా మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్‌కు చెందిన సాయిరాంగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటానని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కటకం నర్సింగ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

వనస్థలిపురం ఏసీపీగా భీంరెడ్డి



హస్తినాపురం: వనస్థలిపురం డివిజన్ ఏసీపీగా ఎస్.భీంరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఏసీపీగా పని చేస్తున్న కే పురుషోత్తంరెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా పటాన్‌చెరువు ఏసీపీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎస్.భీంరెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. పటాన్‌చెరువు ఏసీపీగా పనిచేసిన భీంరెడ్డిని గత శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ కాగా తాజాగా గురువారం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను వనస్థలిపురం బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

కిషన్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి తరలిన బీజేపీ నేతలు


కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి తరలి వెలుతున్న బీజేపీ నేతలు

చంపాపేట: రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా శుక్రవారం చంపాపేట డివిజన్ కార్పొరేటర్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, రాజేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డికి అభినందనలు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని శుక్రవారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


గడ్డిఅన్నారం డివిజన్‌లో వరదనీరు


భీమానగర్ కాలనీలో వరదనీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్


సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో..

పొంగిన డ్రైనేజీలు.. మునిగిన కాలనీలు

- భారీ వర్షాలకు పలు కాలనీలు జలమయం
- పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు


సరూర్‌నగర్ చెరువులో చెత్తను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

హస్తినాపురం: గత కొన్ని రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా హస్తినాపురం డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ముంపు భయంతో బెంబేలెత్తుతున్నారు. డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సాగర్‌ఎన్‌క్లేవ్‌కాలనీ, భీమానగర్‌కాలనీ, రెడ్డికాలనీ, ద్వారకా తిరుమల నగర్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ముంపు సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. గురువారం రాత్రి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ సుజాతనాయక్ అధికారులతో కలిసి పర్యటించారు.

సరూర్ నగర్ చెరువు గేట్ల ఎత్తివేత

చైతన్యపురి: భారీ వర్షాల కారణంగా సరూర్‌నగర్ చెరువులోకి భారీగా వరదనీరు చేరటంతో ఇరిగేషన్ అధికారులు శుక్రవారం చెరువు ఔట్‌లెట్‌ను ఎత్తారు. దీంతో గడ్డిఅన్నారం డివిజన్‌లోని శారదానగర్, కోదండరాంనగర్ కాలనీల్లో నాలాలు పొంగి రహదారులు జలమయమయ్యాయి. నాలాల పూడిక తీత పనులు సక్రమంగా జరగకపోవటంతో వరదనీరు రహదారులపై ప్రవహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు గంటలోనే మళ్లీ గేట్లను మూసివేశారు. చెరువులోని చెత్తా చెదారం నాలాల్లోకి చేరుతుండటంతో నీరు సాఫీగా ముందుకు వెళ్లక పలు కాలనీలు జలమయమయ్యాయి. దీంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెరువు నీటిలోని చెత్తను తొలగించే పనులు చేపట్టారు.

జాలీ ఏర్పాటు చేయాలి

సరూర్‌నగర్ చెరువు ఔట్‌లెట్ దగ్గర జాలీ ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన వరద ప్రభావిత కాలనీల్లో పర్యటించారు. నాలాలు పొంగి వరదనీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో వెంటనే అధికారులకు చెప్పి గేట్లను మూసివేయించారు. ఇప్పటికైనా ఔట్‌లెట్ దగ్గర జాలీ ఏర్పాటు చేయాలని సూచించారు.

రహదారులు బురదమయం

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో భారీ వర్షాల కారణంగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. శుక్రవారం ఆర్‌కేపురం, సరూర్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట్, అక్బర్‌బాగ్, మూసారంబాగ్, సైదాబాద్, కుర్మగూడ, అజంపుర తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ పైపుల లీకేజీ కారణంగా రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై బురద పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భయం గుప్పిట్లో లోతట్టు కాలనీల ప్రజలు

సరూర్‌నగర్, మలక్‌పేట్, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలో నాలాల సామర్థ్యాన్ని పెంచకపోవడం, పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఇళ్లల్లోకి నీరు వస్తోందని. ఇళ్లల్లో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆయా ప్రాంతాల వాసులు పేర్కొంటున్నారు. వర్షాల కారణంగా సరూర్‌నగర్, ఆర్‌కేపురం, మూసారంబాగ్, సైదాబాద్‌లలోని పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి వరదనీరు చేరింది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


ఆర్‌కేపురంలో..


మార్గదర్శి కాలనీలో..


సరూర్‌నగర్ చెరువు ఔట్‌లెట్ గేట్లు ఎత్తుతున్న దృశ్యం

పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజలకు కష్టాలు


గడ్డిఅన్నారం డివిజన్‌లో పర్యటిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

చైతన్యపురి: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వరదనీరు ఇళ్లను ముంచెత్తుతోందని, ప్రజలు కష్టాలు పడుతున్నారని ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్ కాలనీలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో రహదారులు నదులను తలపిస్తున్నాయన్నారు. హైదరాబాద్‌ను డల్లాస్ చేస్తాం, ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పలు చెప్పారని, వాస్తవానికి చిన్నపాటి వర్షానికే నగరం అతలాకుతలం అవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌యాదవ్ సురేందర్‌రెడ్డి, వేణుయాదవ్, కిషోర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీను, గోవర్ధన్, గులాం మహమ్మద్, శరత్‌రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జల్‌పల్లిలో బోనాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని దేవాలయాలు బోనాల పండగకు ముస్తాబవుతున్నాయి. ఆదివారం బోనాలను పురస్కరించుకొని గ్రామంలోని రెండు పోచమ్మ దేవాలయాలు, మల్లన్న దేవాలయాల వద్ద మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు. 16వ వార్డు కౌన్సిలర్ బుడుమాల యాదగిరి శుక్రవారం ఆలయాలకు రంగులు వేయించారు. ఆదివారం నిర్వహించే వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. సోమవారం తొట్టెల, పోతరాజులు ఊరేగింపు ఉంటుందని స్పష్టంచేశారు. నగరంలో ఆషాఢ మాసం బోనాల అనంతరం జల్‌పల్లిలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. గ్రామస్తులందరూ ప్రశాంత వాతావరణంలో పండుగలు చేసుకోవాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


జీహెచ్‌ఎంసీ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. వర్షాల కారనంగా డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో వరదనీరు రోడ్డుపై నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ మాన్‌సూన్ బృందాలతో కలిసి అక్కడికి వెళ్లి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. హయత్‌నగర్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కుమార్‌తో కలిసి డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బీడీఎల్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. వరదనీరు నిలిచే ప్రాంతాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వరదనీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని డీసీని కోరారు.

కాంగ్రెస్ సీనియర్ నేత ఎరుకల కృష్ణ మృతి


ఎరుకల కృష్ణ గౌడ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎరుకల కృష్ణ గౌడ్ శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కర్మన్‌ఘాట్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కృష్ణగౌడ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణగౌడ్ కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నల్లా రఘుమారెడ్డి, రాజిరెడ్డి, కృష్ణమాచారి, అంజిరెడ్డి, ఉమామహేశ్వర్, చీర శ్రీనివాస్, గోపాల్ ముదిరాజ్, చందు యాదవ్, జగదీష్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ క్రాస్ బో షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో చరణ్‌కు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన చరణ్

దిల్‌సుఖ్‌నగర్: ఆగ్రాలో జరిగిన 2023 నేషనల్ క్రాస్ బో షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీ అనాథ వసతి గృహ విద్యార్థి కె. చరణ్ కుమార్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించాడు. నేషనల్ క్రాస్ బో షూటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ రజత్ విజ్ చేతుల మీదుగా చరణ్ పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా వసతి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ మాట్లాడుతూ చరణ్ విద్యలోనూ అద్భుతంగా రాణిస్తున్నాడని, షూటింగ్ పోటీల్లోనూ సత్తా చాటడం అభినందనీయమన్నారు. అక్టోబర్‌లో ఆగ్రాలోని ఏకలవ్య స్టేడియంలో నిర్వహించనున్న 2023 – ప్రపంచ స్థాయి షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు అతను అర్హత సాధించినట్లు తెలిపారు.

గుర్రంగూడ అభివృద్ధికి వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడను అభివృద్ధి స్థానిక కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్ శుక్రవారం మంత్రి సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గుర్రంగూడలోని ఎక్కంకుంట చెరువు సుందరీకరణ కోసం రూ.50 లక్షలు మంజూరు చేయా లని కోరామన్నారు. అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వరకు రోడ్డు పనులకు గాను ఇప్పటికే రూ.3 కోట్లు కేటాయించారని తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన పనులను పూ ర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ గ్రామంలో శుక్రవారం నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను వైభవంగా నిర్వహించారు. యంజాల శ్రీధర్ కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో రెండు రోజులుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, విగ్రహ స్వపనం, హోమాలు నిర్వహించారు. పూజారి భానుప్రకాశ్ శర్మ పర్యవేక్షణలో శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు లక్ష్మీనారాయణ హోమం, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, దృత్ దిక్ బలి, పూర్ణాహుతి, పండిత సన్మానం, అనంతరం బోనాల సమర్పణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారికి పూజలు చేశారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు


ఆల్తాఫ్‌నగర్‌లో నీట మునిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే 90శాతం బాక్స్ డ్రైన్ పనులు పూర్తయ్యాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఆల్తాఫ్ నగర్ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరడంతో శుక్రవారం ఎమ్మెల్యే మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముంపు బాధితులకు కార్యకర్తలు, నాయకులు అండగా ఉంటారన్నారు. త్వరలో పనులు పూర్తి చేసి ముంపు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈలు వెంకటేశ్వరరావు, కనకయ్య, నాయకులు తిలక్‌రావు, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి


మారుతీనగర్ కాలనీలో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ మారుతీనగర్‌లో తాగునీటిలో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. మారుతీనగర్ కాలనీ రోడ్ నెంబర్ 13లో కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు స్థానికులు సమాచారం అందించారు. దీంతో శుక్రవారం కార్పొరేటర్ పవన్ కుమార్ అక్కడికి వెళ్లి సమస్యను పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. ఎన్నో రోజులుగా డ్రైనేజీ సమస్య ఎదుర్కొంటున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. డివిజన్ పరిధిలో పైప్‌లైన్ మార్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుందర్ నారాయణ, మంచి రాజేష్, కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ డిక్లరేషన్ సభకు రవాణా రంగ కార్మిక జేఏసీ మద్దతు


పోస్టర్‌ను అవిష్కరిస్తున్న జేఏసీ నాయికులు

ఎల్‌బీనగర్: కామ్‌గర్ కర్మచార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న నాంపల్లి గాంధీ భవన్ సమీపంలోని ప్రకాష్ హాల్‌లో నిర్వహించనున్న డ్రైవర్ డిక్లరేషన్ సభకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ రవాణా రంగ కార్మిక ఐక్య సమితి నాయకులు తెలిపారు. మద్దతుకు సంబంధించిన పోస్టర్‌ను శక్రవారం ఎల్‌బీనగర్‌లోని సమితి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవాణా కార్మికుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చేందుకు అంగీకరించినందున సభకు మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐక్య సమితి కన్వీనర్ దయానంద్, కో కన్వీనర్‌లు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, రుద్రక్ష, మల్లేష్, సంపత్‌రెడ్డి, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు రవి, సభ్యులు రాంపల్లి మల్లేష్, ఉప్పల్ శివ, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎండీ ముక్తర్, సభ్యులు మల్లికార్జున్, పాండు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురువందనం కార్యక్రమం


శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఉమేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్

వనస్థలిపురం: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, నక్క వెంకటమ్మ యాదవ్ నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో వనస్థలిపురం ద్వారకామయినగర్ కాలనీలోని త్రయోదశ దేవాలయం ప్రాంగణంలో మూడు రోజులుగా కొనసాగుతున్న 'గురువందనం' కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సంగీత కళారత్న యరగొల్ల శ్రీనివాస్ యాదవ్ నిర్వహణలో భక్త రామదాసు, రాకమచెర్ల వెంకటదాసు, మన్నెంకొండ హనుమద్దాసు, ఆది శంకరుల స్తోత్రాలను ఈ సందర్భంగా పలువురు గానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నక్క ఉమేష్ యాదవ్, నక్క శ్రీనివాస్ యాదవ్, దేవాలయ పాలకమండలి సభ్యులు హనుమంతరాయ శర్మ, ప్రవీణ్‌కుమార్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో వ్యర్థాలను వేయొద్దు


బీరప్పగుడి వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంతంలోని బీరప్ప గుడి వద్ద మురుగునీరు చెరువులోకి చేరుతుండటాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలాల్లో వ్యర్థాలు వేయవద్దని, వ్యర్థాల కారణంగా నాలాలు పూడుకుపోయి పరిసర కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. డ్రైనేజీ మూతలు తెరచి పెట్టవద్దని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. అత్యవసర పని ఉంటేనే ఇంట్లో నుంచి బయటకు రావాలని, అత్యవసర ప్రమాదం ఏర్పడితే వెంటనే జీహెచ్‌ఎంసీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెరువుల పరిశీలన


సరూర్‌నగర్ చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ పంకజ

ఎల్‌బీనగర్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరుతుండడంతో ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ పంకజ శుక్రవారం పలు చెరువులను స్థానిక అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. సరూర్‌నగర్, మీర్‌పేట్, రామంతాపూర్ పెద్ద చెరువు, చిన్న చెరువు, పటేల్ చెరువు, కాప్రా, నాచారం చెరువులను పరిశీలించి వాటి లెవెల్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, చెరువులన్నీ 1 నుంచి 2 మీటర్ల వరకు ఎఫ్‌టీఎల్‌కు తక్కువగా ఉన్నట్లు తెలిపారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

హస్తినాపురం: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా, మాధవానిపల్లి గ్రామానికి చెందిన అలశెట్టి సత్యనారాయణ అలియాస్ సత్యం డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ నగరంలో నివాసం ఉంటున్నాడు. అదే జిల్లాకు చెందిన కొకుంట్ల అవినాష్ అలియాస్ అభి వంటమనిషిగా పనిచేస్తూ తుర్కయాంజాల్ గ్రామ పరిధిలోని వైఎస్‌ఆర్ కాలనీలో ఉంటున్నాడు. వీరిద్దరు కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అదే సమయంలో బైక్‌పై అటుగా వెళుతున్న సత్యనారాయణ, అవినాష్‌లను ఆపి బైకుకు సంబంధించిన డాక్యుమెంట్లను చూపించాల్సిందిగా కోరారు. దీంతో వారు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి నాలుగు బైకులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.